

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 6వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 6వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ సెల్

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 6వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 6వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

జోరువానలోనూ
సిపిఎం భూ పోరాటం

- చంద్రగిరి ఎమ్మెల్యే హామీని నిలబెట్టుకోవాలి : కందారపు మురళి
- నకిలీ పట్టాలపై విచారణ చేస్తామన్న ఆర్డీవో
- పేదలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

నిరుపేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సిపిఎం చేపట్టిన భూ పోరాటం ఉద్రిక్తతల నడుమ సాగింది. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన భూ పోరాటాన్ని అడ్డుకోవాలని పెద్దసంఖ్యలో పోలీసులు అడ్డువచ్చినా.. జోరు వానలోనూ మొక్కవోని దీక్షతో ర్యాలీగా వెళ్లి భూ పోరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనింగ్ అకాడమీ స్థలంలో ఎన్టీఆర్ గహకల్పన ద్వారా ఇల్లు మంజూరు చేస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హామీ ఇచ్చారని, కానీ కొందరు అకాడమీ స్థలాన్ని ఆక్రమించి ఆక్రమ నిర్మాణాలు చేస్తుంటే అధికార యంత్రాంగం అడ్డుకోకపోగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పోరాటం చేస్తుంటే అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి ప్రశ్నించారు.



ఆర్డీవోతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు



జోరు వానలో జెండాను అడ్డుపెట్టుకొని భూపోరాటంలో పాల్గొన్న పేదలు

మూడు రోజుల ముందు ఈనెల 2వతేదీ తిరుమల నగర్ గ్రామపంచాయతీ చెన్నాయిగుంట గ్రామలెక్క దాఖలా సర్వేనెంబర్ 195/2/4 లోని 41 ఎకరాల 25 సెంట్లు సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలంలో ఇల్లులేని అర్హులైన పేదలందరూ ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని సిపిఎం బహిరంగ ప్రకటన ద్వారా పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అర్హులైన పేదలందరూ సిపిఎం భూపోరాటానికి మద్దతు ఇస్తూ ఆదివారం తిరుపతి- కరకంబాడి మార్గంలోని బొమ్మల క్వార్టర్స్ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. కందారపు మురళి ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేపట్టి భూ పోరాటంలో భాగంగా ర్యాలీగా సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలం వద్దకు వెళుతుండగా మార్గమధ్యలో పెద్ద సంఖ్యలో పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే హామీ మేరకే ఇంటి స్థలాల కోసం వెళుతున్నామని తమ పోరాటానికి అడ్డు చెప్పవద్దని కోరినా పోలీసులు వినకపోవడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి జోరువానలో నినాదాలు చేశారు. దీంతో పోలీసులకు, సిపిఎం నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ సర్వే ట్రైనింగ్ అకాడమీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని తాము ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఆక్రమణలను అడ్డుకొని నిలువరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 2700 పట్టాలు పేదలకు ఇచ్చారని, స్థలం నేటికీ చూపలేదన్నారు. ఆనాటికి ఈనాటికి తేడా ఏమీ కనబడడం లేదని, పేదలకు మాత్రం అవస్థలు తప్పడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా... ఇచ్చిన హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటం సమర్థనీయం కాదన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయని అధికారుల దష్టికి తీసుకువెళ్లినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆక్రమణలు చేసేవారు వారు పొందినవి నిజమైన పట్టాలు అయితే రాత్రిళ్ళు ఇళ్ల నిర్మాణం చేపట్టడం ఎందుకని, వాటి పైన పూర్తిస్థాయి విచారణ జరిగి, నకిలీ పట్టాలు అని తేలితే చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రామ్మోహన్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సిపిఎం నేతలు, పేదలతో మాట్లాడారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆర్డీవో స్పష్టం చేశారు. బిటిఆర్ కాలనీ, మంగళం ప్రాంతంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. అర్హులైన వారందరికీ స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని, సర్వే ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటుకు మరొకచోట స్థల పరిశీలన చేయడానికి ప్రభుత్వానికి త్వరలోనే లేఖ రాస్తున్నామని, మంగళం ప్రాంతంలో ఉన్న పేదలందరికీ తిరుమల నగర్ ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రజలందరూ ఇళ్లస్థలాల కోసం 10వ తేదీన ఆర్డీవో కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలు చేయాలని పూనుకుంటే ఎంతటి వారినైనా విడిచిపెట్టమని, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో ఇచ్చిన హామీతో సిపిఎం నేతలు చేపట్టిన భూ పోరాటాన్ని విరమించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్, జిల్లా నేతలు ఎస్.జయచంద్ర, మాధవ్, సాయిలక్ష్మీ, రవి, తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ వాయిదా: కడ పీడీ

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 6వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముక్కంటి సేవలో నటుడు సుమన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం ప్రముఖ నటుడు సుమన్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ఏఈవో మోహన్ ఒక్కటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికాలు అందజేశారు. అనంతరం స్థానిక జుమ్ లేషా పీర్ దర్గాను కూడా సుమన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్గా పిఠాధిపతి సాదరస్వాగతం పలికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



వర్షాకాలంలో ఇరిగేషన్ శాఖ అప్రమత్తం

ఇంటర్వ్యూ

- వెంకటేశ్వరరాజు, జల వనరుల సంరక్షణ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

వర్షాల నేపథ్యంలో జలవనరుల సంరక్షణ శాఖ జిల్లా వ్యాప్తంగా అప్రమత్తంగా ఉన్నట్లు జల వనరుల సంరక్షణ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రాజు తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, జల వనరుల సంరక్షణశాఖ అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, మైనర్, మేజర్ చెరువుల నేటి మట్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో...



ప్రజాశక్తి: జిల్లాలోని ప్రాజెక్టులు రిజర్వాయర్ల పరిస్థితి ఏమిటి..?

ఎస్ఈ: చిత్తూరు జిల్లాలో కృష్ణాపురం ప్రాజెక్టు, ఎన్టీఆర్ జలాశయంతో పాటు అడవిపల్లి రిజర్వాయర్ ఉన్నాయి. ఎన్టీఆర్ జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉండడంతో దిగువకు నీటిని వదలడం జరుగుతోంది. కృష్ణాపురం రిజర్వాయర్లు 90శాతం పైగా వర్షపు నీటితో నిండింది. ప్రాజెక్టుల వద్ద 24 గంటలు పర్యవేక్షణలో ఉంటూ ఎలాంటి పరిస్థితి అయినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం.

ప్రజాశక్తి: జిల్లాలో చెరువులు ఎన్ని ఉన్నాయి..?

ఎస్ఈ: జిల్లాలో 4,303 చెరువులు ఉన్నాయి. ఈచెరువుల కింద 46,903 ఎకరాల ఆయకట్టు ఉంది. 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుది.

ప్రజాశక్తి: చెరువుల కబ్జాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్ఈ: జిల్లాలోని మేజర్, మైనర్ చెరువుల భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారుల సహాయంతో చర్యలు చేపట్టడం జరుగుతోంది. జిల్లాలోని చెరువుల భూములను సమగ్రంగా సర్వేచేసి రెవెన్యూ రికార్డుల ద్వారా ఆక్రమణకు గురైన వివరాలను సేకరిస్తున్నాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చెరువులు, కుంటల భూముల ఆక్రమణ చట్టరీత్యా నేరం.

ప్రజాశక్తి: అధిక వర్షాలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు..?

ఎస్ఈ: వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేయడం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆయకట్టుదారులకు తగిన సూచనలు అందిస్తూ ఎప్పటికప్పుడు ప్రాజెక్టులు రిజర్వాయర్లు, చెరువుల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరుగుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చెరువుల్లో వరద నీటి శాతం బాగా పెరిగింది. వాగులు, వంకల వద్ద ఎలాంటి ప్రమాదాలు చేరకుండా రెవెన్యూ ఇరిగేషన్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

హరించుకుపోతున్న పచ్చదనం

- కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేరా..?
- రాత్రి వేళల్లో తరలిపోతున్న వృక్ష సంపద

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం దట్టమైన అడవులు ఎన్నో రకాలైన వృక్ష సంపదతో కూడి ఉంటుంది. పచ్చదనాన్ని ఆభరణంగా కలిగి ఉన్న మండలంలో భారీ వృక్షాలను అక్రమ కలప రవాణా దారులు నరికివేసి లారీలలో ట్రాక్టర్లలో లోడు చేసి రాత్రివేళలో తరలిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ నిత్యం మండలంలో ఏదో ఒక ప్రాంతంలో భారీ వృక్షాలు నేలకు ఒరుగుతున్నాయి. రెవెన్యూ, అటవీశాఖ అధికారుల అనుమతితో అత్యవసరమైన, తప్పనిసరి పరిస్థితులలో ఎక్కడైనా వృక్షాలను కొట్టి ఆ ప్రాంతంలో సమస్యను పరిష్కరించుకోవచ్చు. అయితే మండలంలో నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా వృక్షాలను నరికి అక్రమంగా మండల హద్దులు దాటిస్తూ అక్రమదారులు లాభాలు గడిస్తున్నారు. వృక్ష సంపదను కాపాడాలని పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటుంటే దానికి విరుద్ధంగా వృక్ష సంపద అక్రమార్కుల దాహానికి బలైపోతున్నాయి. దీనిపై మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి భారీ వృక్షాలను నరికి వేయకుండా అక్రమంగా తరలించకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రాత్రి వేళల్లో తరలిపోతున్న వృక్ష సంపద

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమావేశం




భద్రతా ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో ముఖ్యమంత్రి త్వరలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధ్యక్షతన తిరుపతి పోలీస్ అతిథి గృహం సమావేశ హాల్‌లో అడ్వాన్స్ సెక్యూరిటీ లైయసన్ (ఏఎస్ఎల్) సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎం సెక్యూరిటీ అధికారులు, ఇంటెలిజెన్స్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, ఫైర్, హెల్త్, ఎలక్ట్రిసిటీ, రవాణా శాఖల అధికారులు, సీనియర్ పోలీస్ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో ముఖ్యంగా భద్రతాపరమైన అంశాలపై చర్చ జరిగింది. అనంతరం హెలిప్యాడ్, నారావారిపల్లి తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లలో ఎటువంటి లోపం ఉండకూడదని, ప్రతి శాఖ వారు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పిలు రవిమనోహర్ ఆచారి, నాగభూషణరావ్, వెంకటరాముడు, శ్రీనివాస రావ్, డిస్పిలు వెంకట నారాయణ, ప్రసాదరావ్, సిటీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఇంటెలిజెన్స్ అధికారులతో పాటు అన్ని సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తమ్ముడి విస్తరి కార్యక్రమానికి విచ్చేస్తున్న సీఎం..

ప్రజాశక్తి - చంద్రగిరి : సీఎం చంద్రబాబు నాయుడు గారు రేపు తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు విస్తరి కార్యక్రమానికి నారావారిపల్లెకు రానున్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నారా ఇందిర, నారా గిరీష్‌లు పర్యవేక్షించారు. సీఎం కుటుంబ సమేతంగా రానుండటంతో ఈ పర్యటన అధికారులు, నాయకులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎ.రంగంపేట హై స్కూల్ వెనుక భాగంలో హెలిపాడ్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడులు పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే కార్యకర్తలకు, అభిమానులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే నాని సూచించారు.



రంగంపేటలో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యేలు

గురువులది ఎప్పుడూ ప్రత్యేక స్థానమే..

రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు



పుంగనూరులో..



చిత్తూరులో..

ప్రజాశక్తి- పుంగనూరు: ప్రపంచంలో గురువులకు ఎప్పుడు ప్రత్యేక స్థానం ఉంటుందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నానాభాల గణేష్, సిఎస్.రాజారెడ్డిలు అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా స్థానిక రోటరీ కార్యాలయంలో ఆదివారం గురువులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే గురువులది ఒక ప్రత్యేక స్థానమని, వివిధ రంగాలలో గొప్ప వ్యక్తులుగా ఉన్నటువంటి ప్రతి వ్యక్తి ఒక గురువు దగ్గర శిష్యుడేనని వారిని సన్మానించుకోవటం పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. పట్టణంలోని ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ వివిధ సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి గొప్ప వ్యక్తులను గుర్తించి వారిని సన్మానిస్తు, దుశ్యాలవ, మెమొంటోని బహకరించి, వారిని గౌరవించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రోటరి సభ్యులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరన్ కుమార్, సుధాకర్ రెడ్డి, భాస్కర జెట్టి, అనిల్ కుమార్, మునిరాజా, ఆవుల హరిప్రసాద్ పాల్గొన్నారు.

పలమనేరు బాలాజీకి గురుతేజం జీవన సాఫల్య పురస్కారం

పలమనేరు: చిత్తూరు రెవెన్యూ భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో రచయిత, కవి, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీకి గురుతేజం జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఉషోదయ ఫౌండేషన్, కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ రంగంలో మూడు దశాబ్దాలపైగా కృషి చేస్తున్న రచయిత పలమనేరు బాలాజీని ఘనంగా సత్కరించారు. కథ కవిత నవల విమర్శ రంగాలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు పొందిన బాలాజీ నాలుగు కథాసంపుటాలను, మూడు కవితా సంపుటాలను, నవలను వెలువరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుచే రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ధనాసి ఉషారాణి, చిత్తూరు రూరల్ సిఐ నిత్య బాబు, శ్రీధర్ రెడ్డి పాల్గొని పలమనేరు బాలాజీని శాలువతో సన్మానించారు.

గురువులను స్మరించుకోవడం అందరి బాధ్యత..

బంగారుపాళ్యం: గురువులను స్మరించుకోవడం మనందని బాధ్యత అని పూర్వవిద్యార్థులు సాయి అన్నారు. ఆదివారం మండలంలోని నల్లగాడు ఎస్‌విఎస్ ఉన్నత పాఠశాలలో 2001 పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా రాణించాలంటే గురువులే ముఖ్యమని గురువు లేనిది ఏ వృత్తిలోనూ రాణించలేమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. మాజీ ప్రధానోపాధ్యాయులు రామయ్య, ఉపాధ్యాయులు సావిత్రి. పూర్వవిద్యార్థులు రూప, రాణి, రెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళ్యంలో


అసత్య ప్రచారాలను కాదు ..

టిటిడి వెబ్ సైట్‌ను నమ్మండి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానంపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని, టిటిడి వెబ్సైట్ ను ఫాలో కావాలని దేవస్థానం వివరించింది. వృద్ధుల దర్శన సమయం, అలిపిరిలో మందు బాటిళ్ల విషయమై టీడీపీ క్లారిటీ ఇచ్చింది. తిరుమలలో వయో వృద్ధుల దర్శనం గురించి తప్పుదోవ పట్టించేలా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని టీటీడీ స్పష్టం చేసింది. రోజూ వేయి మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఈ దర్శనాలకు సంబంధించిన ఆన్ లైన్ కోటాను మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తామని అలాగే తిరుమల నంబి ఆలయం వద్దనున్న సీనియర్ సిటిజన్/పీహెచ్‌సీ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటలకు వారిని శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని తెలిపింది. సోషల్ మీడియాలో ప్రసారమయ్యే తప్పుడు వార్తలను నమ్మవద్దన్న టిటిడి వెబ్సైట్ ను సంప్రదించాలని వివరించింది. అలిపిరి మెట్ల మార్గం వద్ద కొంతమంది మందుబాబులు.. మద్యం సీసాలను పగులగొట్టి రోడ్డు మీద వేశారంటూ సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శాంతిపురం: దేవాలయం వద్ద పూజకు వెళ్ళిన వ్యక్తిపై తేనెటీగలు ముక్కుమ్మడిగా దాడి చేయడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండల పరిధిలోని గుండిశెట్టిపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ రెడ్డి (గాంధీ) బంధువుల మునిదేవర కార్యక్రమానికి హాజరై దేవాలయం వద్ద ఉండగా పూజలు చేసి ధూపం ఎక్కువగా వేయడంతో పక్కనే చెట్టుపై ఉన్న తేనెపట్టు నుండి తేనెటీగలు ఒకసారిగా భక్తులపై దాడి చేశాయి, దీంతో భక్తులు చెల్లాచెదురు కాగా విశ్వనాథరెడ్డి, సురేష్‌లపై తేనెటీగలు దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు హుటాహుటిగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ విశ్వనాథ రెడ్డి(47) మృతి చెందాడు. గాయపడిన సురేష్(49)ను మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. విశ్వనాథ్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



విశ్వనాథరెడ్డి (ఫైల్ ఫోటో)

అల్లుడిపై కన్నేసి..కూతుర్ని కాటేసి

కేవీబీపురంలో దారుణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అల్లుడితో కామవాంఛ తీర్చుకునేందుకు కన్నపేగునే కాటేయాలని చూసిందో తల్లి. ఆ వాంఛ శాశ్వతంగా ఉండాలనే దురుద్దేశంతో కూతురు ఎదుటే అల్లుడితో తాళికట్టించుకునే ఘాతుకానికి ఒడిగట్టిన సంఘటన ఇది. అందుకు కూతురు ఒప్పుకోకపోవడంతో అల్లుడితో కలిసి రోకలిబండతో తుదముట్టించే ప్రయత్నం చేసింది. మానవత్వాన్ని, బంధాల్ని మంటగలిపే ఈ జుగుప్సాకర ఘటన ఈనెల శుక్రవారం 3వ తేదీ చోటు చేసుకోగా ఆదివారం వెలుగు చూసింది. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలుడు (18), కేవీబీపురం మండల కేంద్రానికి చెందిన బాలిక(15) ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త చనిపోవడంతో బాలిక తల్లి (40) ఈ జంటతోనే కలిసి ఉంటోంది. ఈ క్రమంలో కొన్నాళ్లుగా ఆమెకు అల్లుడితో వివాహేతర బంధం ఏర్పడింది. శుక్రవారం రాత్రి భార్య పక్కన ఉండగా వారిద్దరూ పెళ్లి చేసుకోబోయారు. ఈ సందర్భంలో తల్లి మెడలో తాళి కడుతున్న భర్తను బాలిక అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఆమె తల్లి, భర్త బాధితురాలిపై దాడికి దిగారు. రోకలి బండతో తలపై మోదడంతో తీవ్రంగా గాయపడ్డ ఆమె కేకలు విన్న స్థానికులు వచ్చి బాలికను రక్షించారు. అత్త, అల్లుడిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేహశుద్ధి చేశారు. వారు అక్కడ నుంచి వరదయ్యపాలెంకు పారిపోవడంతో కేవీబీపురం పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కామాంధుల చేతుల్లో తీవ్రంగా గాయపడ్డ బాలికను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



నిందితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

- 39 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక - గుర్తుకొచ్చిన ఆనాటి జ్ఞాపకాలు
- ఆటపాటలతో సందడి -కళావేదిక డైట్‌కు అంకితం

ప్రజాశక్తి -కార్వేటినగరం : వారంతా ఒకే కళాశాలలో చదువుకున్నారు.. చదువు పూర్తవ్వగానే ఎవరికి వారే ఉపాధ్యాయులుగా వెళ్లిపోయారు. ఎవరు ఏ పాఠశాలలో పనిచేస్తున్నారు,ఎవరు ఎక్కడ స్థిరపడ్డారో ఎవరికి తెలియదు. ఎక్కడో ఒకరో ఇద్దరో అప్పుడప్పుడు కలుసుకొని మాట్లాడుకునేవారు. ఇతర మిత్రుల గురించి వారు చేసుకునేవారు తప్ప పెద్దగా పరిచయాలు లేనివారుగా మారిపోయారు. ఇంతలో ఒక ఫోన్ కాల్ తమ టిటిసి కళాశాల జ్ఞాపకాలను గుర్తుతెచ్చింది. మనం కలిసి చదువుకున్న డైట్ కళాశాలలో అప్పటి స్నేహితులతో మళ్లీ అపూర్వ కలయికకు శ్రీకారం చుడుతున్నామన్న వారి మాటలు వారందరినీ ఒకటి చేశాయి. అనంతపురం, కర్నూలు నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలో ఎక్కడెక్కడో ఉన్న వారందరినీ ఒకటిగా చేసింది 39 ఏళ్ల తర్వాత మళ్లీ డైట్ లో విద్యార్థులుగా మారిపోయారు. ఆంధ్రప్రదేశ్ లోనే ఆదర్శ డైట్‌గా పేరొందిన జిల్లా విద్యా శిక్షణ సంస్థలో 1985 -86 విద్యా సంవత్సరంలో టీచర్ ట్రైనింగ్ కోర్సు చదివిన విద్యార్థులు ఆదివారం డైట్ కళాశాలలో అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో వంద మంది విద్యార్థులు కలిసి ఒక సంవత్సరం పాటు టిటిసి చదువుకున్నారు. వీరిని ఇన్నేళ్ల తర్వాత ఒకటి చేయాలనే ఉద్దేశంతో కార్వేటి నగరానికి చెందిన ఆ బ్యాచ్ విద్యార్థులు గాజుల నాగేశ్వరరావు, మర్రి శేఖర్, ఆనంద్,మురుగన్ ల స్నేహితుల వివరాలను సేకరించి అపూర్వ కలయిక ప్రయత్నంలో విజయం సాధించారు. వయసు మీరినా ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యా బోధన నేర్పి మృతి చెందిన గురువులకు, మిత్రులకు శ్రద్ధాంజలి ఘటించారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న డైట్ పూర్వ విద్యార్థులు


ఆకాశంలో ఏర్పడిన రంగురంగుల హరివిల్లు

ఆకాశంలో అందాల హరివిల్లు

ప్రజాశక్తి - రామకుప్పం : కారు మబ్బులు కమ్ముకొని.. సంధ్యా సమయంలో వచ్చిన ప్రకృతి రమణీయత నడుమ..ఆకాశంలో రంగు రంగుల ఇంద్రధనస్సు ఆదివారం ఎస్ గొల్లపల్లి చెరువు వద్ద చూపరుల హృదయాలను హత్తుకుంది.



వైభవంగా లక్ష్మీనారాయణుని కల్యాణోత్సవం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణతో అలరించి పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛారణ మధ్య వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులుగా లక్ష్మీనారాయణ, జయంతి ఆలయ ఛైర్మెన్ వెంకటేష్ రెడ్డి, పలువురు అర్చకులు పాల్గొన్నారు. పర్యాటకులు తగు జాగ్రత్తలు పాటించాలని వికోట సిఐ సోమశేఖర్ రెడ్డి సూచించారు.

తగ్గించిన జీఎస్‌టీపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టిపై అవగాహన చేపట్టాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని అంబేద్కర్ విగ్రహం నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ట్రాక్టర్ ఆటోల ద్వారా ర్యాలీ చేపట్టారు. మండల టిడిపి అధ్యక్షులు ధరణి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 శాతం జీఎస్టీ ఉన్న కొన్ని ఐదు శాతం జీఎస్టీ నిర్ణయించి ఐదుధరలకు 13 శాతం రాయితీలను కల్పించాలని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కొనుగోలు చేపట్టేటప్పుడు జీఎస్టీ రాయితీతో ఉన్న పరిశీలించుకోవాలని అన్నారు. ఆటో వారికి చెప్పిన విధంగా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు జయ ప్రకాష్, జయ, సింగిల్ విండో ఛైర్మెన్ హేమచంద్ర నాయుడు ఎఎంసి ఛైర్మెన్ భాస్కర్ నాయుడు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ బీసీ నాయకులు బుస నాగరాజు గౌడు కోదండ యాదవ్ పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కంటి ఆపరేషన్లకు ఎంపికైన రోగులతో వైద్యులు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆపరేషన్‌కు 11 మంది ఎంపిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని ప్రజలకు ఆరోగ్య సేవలను అందించే క్రమంలో మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు చొరవతో, ప్రతి నెల రెండవ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ నెల శిబిరాన్ని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. కుప్పం పిఇఎస్ హాస్పిటల్ నుండి వచ్చిన వైద్య బృందం ఈ శిబిరంలో సేవలందించారు. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి కంటి సమస్యలతో బాధపడుతున్న 57 మంది హాజరయ్యారు. వైద్యులు వారిని క్షుణ్ణంగా పరిశీలించగా, కంటి ఆపరేషన్ అవసరమైన 11 మందిని గుర్తించారు. వీరికి పిఇఎస్ హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహతి ఫౌండేషన్ సహాయ ఛైర్మన్ శ్రీనివాసులు కథనం మేరకు.. ప్రకారం, సెలెక్ట్ అయిన రోగులను హాస్పిటల్‌కు తీసుకెళ్లడం, ఆపరేషన్ అనంతరం ఇంటికి చేర్చే వరకు జరగనున్న ఖర్చులన్నింటినీ మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు భరించనున్నారు. అంతేకాక, శిబిరానికి వచ్చిన ప్రజలకు, వైద్యులకు ఉచిత భోజనం కూడా అందించారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, పూర్తి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన


బిగించిన విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టిన అధికారులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: 'ఆలోచన ఘనం...ఆచరణ శూన్యం' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం వార్త వెలువడింది. స్పందించిన విద్యుత్ శాఖ ఉన్నతాధి కారులు వ్యవసాయ పంట పొలాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టారు. ప్రజాశక్తి ఈ వార్తను తమ దృష్టికి తీసుకొచ్చి నందుకు కొనియాడారు. కరెంటు పనులు నాణ్యంగా చేయాలని గుత్తేదారును అధికారులు ఆదేశించారు.

కోలాహలంగా దుర్గమ్మ నిమజ్జనం

ప్రజాశక్తి-కుప్పం: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని ఆదివారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. గంగమాలయంలో 11 రోజులపాటు నిత్య పూజలు అందుకున్న దుర్గమ్మకు నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉడా ఛైర్మన్ డాక్టరు సురేష్, ఆలయ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని కుప్పం పట్టణంలో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండ: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - రామకుప్పం: కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు అండగా నిలిచి సంవత్సరానికి 15 వేల రూపాయలు చొప్పున అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు 435 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లు రోడ్డు ఎక్కాలంటే భయపడాల్సిన పరిస్థితి, గుంతల రోడ్లు, పోలీసుల కేసులు ఒకవైపు, వైసీపీ నేతలు బెదిరింపులు, దౌర్జన్యం, అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రస్తుతం ఆ సమస్యలేమీ లేవన్నారు.


సమావేశంలో పాల్గొన్న వడ్డెర సంఘం నాయకులు

వడ్డెరను అణగదొక్కితే ఉద్యమం: మాధవ్

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గంలో వడ్డెర కులస్తులను అణగదొక్కాలని చూస్తే ఉద్యమిస్తామని వడ్డెర సంఘం అధ్యక్షులు మాధవ్ పేర్కొన్నారు. కుప్పంలో వడ్డెర ముఖ్య నేతలు ఆదివారం సమావేశం అయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 22 వేల మంది ఓటర్లు ఉన్నామని, త్వరలో భారీ సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకుంటే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా కుల సంఘం నేతలు అంతా ఏకం కావాలని పిలుపు నిచ్చారు. వడ్డెర కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం లక్ష్మీపురం వద్ద స్థలం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. త్వరలోనే వడ్డెరకుల రాష్ట్ర నాయ కులు కుప్పం రానున్నారని భారీ ర్యాలీ, సమావేశం నిర్వహిం చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశం లో నారాయణప్ప, రవి, రాజు , బాలు, శంకర్, కేశవులు, నియోజకవర్గానికి చెందిన వడ్డెర కుల ముఖ్య నేతలు పాల్గొన్నారు.


ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ప్రజలకు ఆరోగ్య సేవలను అందించే క్రమంలో పలమనేరు రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు ఎం ప్రభాకర్ చొరవతో, ప్రతి నెల మొదటి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ నెల శిబిరాన్ని పలమనేరు బస్టాండ్ వద్ద వున్న రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేశారు. చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రి నుండి వచ్చిన డాక్టర్ మురళి బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుండి కంటి సమస్యలతో బాధపడుతున్న 62 మంది హాజరయ్యారు. వైద్యులు వారిని క్షుణ్ణంగా పరిశీలించగా, కంటి ఆపరేషన్ అవసరమున్న 34 మందిని గుర్తించారు. వీరికి చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రిలో బుధవారం ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు ఏం ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం, సెలెక్ట్ అయిన రోగులను హాస్పిటల్‌కు తీసుకెళ్లడం, ఆపరేషన్ అనంతరం ఇంటికి చేర్చే వరకు అంతా ఉచితమే. అంతేకాక, శిబిరానికి వచ్చిన ప్రజలకు, వైద్యులకు ఉచిత భోజనం కూడా అందించారు.

సమాజ మార్పుకు కృషి చేయాలి

పి తులసినాథం నాయుడు పిలుపు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): ఉపాధ్యాయులు సమాజ మార్పుకు కృషి చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాథం నాయుడు పిలుపు నిచ్చారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం కళా మందిరంలో ఉపాధ్యాయులుగా ఉత్తమ సేవలందిస్తున్న వారిని జిల్లా స్థాయిలో గుర్తించి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గంగవరం ఎంఈవో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే వుందన్నారు. పిలత (కీలపట్ల), తేజస్వి(పలమనేరు), రాఘవ నాయుడు (ఎస్ఆర్‌పురం), చంద్రశేఖర్ రెడ్డి (నెల్లిపట్ల), సాధన కుమార్ (పుల్లూరు), శశికుమార్ (బైరెడ్డి పల్లి), రాజేంద్ర (శ్రీరంగరాజపురం), రమేష్ (కలగటూరు), కృష్ణమోహన్ (కొత్తపల్లి)లను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి పుష్ప, నరేంద్ర, శివ, జ్ఞానేశ్వర్, శ్రీధర్ స్వామి, సీతారామయ్య, ధనంజయ, విజయ్, ఉమా మహేశ్వర్ రెడ్డి, పలమనేరు బాలాజీ, యుగంధర్, డాక్టర్ రజని, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో తులసినాథంనాయుడు

అలరించిన సంగీత కచేరి

బెంగళూరుకు చెందిన జాయినింగ్ ద డాట్స్ ఆధ్వర్యంలో కళామందిరంలో నిర్వహించిన సంగీత కచేరి శ్రోతలను విశేషంగా అలరించింది. బెంగళూరులోని శ్రీకృష్ణ గాన నిలయంకు చెందిన అర్చన భోజ్, అభయ్, వాసవి, ధనుష్, ప్రసీద, సుదీప్తి, మనస్వి, మనోజ్ఞ జమదగ్ని, బృందం చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది. వీరిని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

పలమనేరు పరిరక్షణ సమితికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-పలమనేరు: ప్రభుత్వం తరఫున పలమనేరు పట్టణంలో పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా విశేష సేవలు అందిస్తున్న పలమనేరు పరిరక్షణ సమితి (పిపిఎస్) ప్రతిష్టాత్మక స్వచ్ఛ ఆంధ్ర అవార్డు-2025కు జిల్లా స్థాయిలో ఎంపికైంది. ఈ మేరకు కలెక్టరు నుంచి ఆహ్వానం అందింది. చిత్తూరు నాగయ్య కళా క్షేత్రంలో సోమవారం నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ అవార్డును పిపిఎస్ ప్రతినిధులు అందుకోనున్నారు. పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఉద్యమాలు, మన ఇల్లు-మన చెట్టు, మట్టి వినాయక విగ్రహాల ప్రోత్సాహం, పార్కుల పునరుద్ధరణ, శానిటరీ వర్కర్ల ప్రోత్సాహం, కార్తీక వనభోజనాలు వంటి పలు కార్యక్రమాలు చేపట్టినందుకు ఈ అవార్డు పిపిఎస్‌కు లభించింది. ఈ సందర్భంగా పిపిఎస్ అధ్యక్షుడు టిఎల్ నరసింహులు, గౌరవ అధ్యక్షుడు ఆనంద బాబు, కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఈ అవార్డును పలమనేరు ప్రజలకు అంకితమిస్తున్నామన్నారు. పలమనేరు ప్రజల మద్దతు, పిపిఎస్ కార్యవర్గం, సభ్యుల సమష్టి కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, పలమనేరు ప్రజలకు పిపిఎస్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం పిళ్ళై, శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్, పొన్నుడీ, రామచంద్ర , సన్నీరాజు, పిపి ఎస్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మదనపల్లిని జిల్లాగా చేయాలి

జిల్లా సాధన కమిటీ డిమాండు

ప్రజాశక్తి -పుంగనూరు: ఎన్నికలకు ముందు మదనపల్లెలో జిల్లాగా చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం హామీ అమలుకు శ్రీకారం చుట్టాలని జిల్లా సాధన కమిటీ డిమాండ్ చేసింది. పుంగనూరు అంబేద్కర్ భవన్‌లో మదనపల్లి జిల్లా సాధన కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు చందు మాట్లాడుతూ మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటైనప్పటి నుంచి మదనపల్లికి ఒక్కసారి కూడా ఉప సంఘం అధికారికంగా రాలేదన్నారు. కనీసం తమ అభిప్రాయాలను తెలుసుకోలేదన్నారు. కొత్త జిల్లాలపై కసరత్తు అన్న పత్రికలలో వార్తా కథనాలు వస్తున్నాయని, అయితే ఎక్కడా మదనపల్లి జిల్లా ప్రస్తావన లేదని జిల్లా ప్రతిపాదన ఉంటుందో లేదో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. మార్కాపురం, అమరావతి, రంప చోడవరం కేంద్రంగా జిల్లాల ప్రతిపాదన జరుగుతున్నట్లు తెలుస్తోందని కాని ఇందుకు అడుగులు పడినట్లు లేదని సందేహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మదనపల్లి షాజహాన్ భాషా 3 పర్యాయాలు అసెంబ్లీలో మదనపల్లి జిల్లా కావాలని అడిగినా ప్రభుత్వ నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 26న మదనపల్లిలో 4 నియోజకవర్గాల ప్రజలతో పెద్ద ఎత్తున నిరసన చేపడు తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వెంకట్ యాదవ్, విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు, , సిపిఐ పట్టణ కార్యదర్శి, రామ్మూర్తి, కాంగ్రెస్ పుంగనూరు పట్టణ అధ్యక్షులు అయిబ్, వాల్మీకి సంఘం నాయకులు గంపల గంగరాజు, ఉమ్మడి చిత్తూరు జిల్లా బాంసెమ్ కార్యదర్శి సుమిత్ర రమణ, మాల మహానాడు రాష్ట్ర నాయకులు అశోక్, బీసీ సంఘం సీనియర్ నాయకులు అద్దాల నాగరాజు, చౌడేపల్లి బ్యాంకు రెడ్డప్ప,రామాంజులు పాల్గొన్నారు.



రౌండుటేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఈ పంట నమోదును వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి -వి కోట : క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. వి కోట మండల పరిధిలో ఆదివారం వారు క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదును పరిశీలించారు. బోడిగుట్టపల్లి, చౌడేపల్లి, పత్రపల్లి , కొత్తూరు గ్రామాలలో ఆర్ఎస్‌కె స్థాయి సిబ్బంది, రెవెన్యూ అధికారులు ప్రత్యక్షంగా పంట నమోదులో పాల్గొన్నారు. పంటలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదును ఈ నెల 20 తేదీ లోపు పూర్తి చేయాలని ఒక్కో ఆర్ఎస్‌కే సిబ్బంది రోజుకి 150 నుండి 300 ల్యాండ్ పార్సెల్ బుకింగ్ చేయాలని ఆదేశించారు. వికోట మండలం జిల్లాలో తక్కువ ఈ పంట నమోదు ఉండడంతో విఆర్‌ఓల సహకారంతో రైతు సేవా సిబ్బంది జాయింట్‌గా పంట నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతిరోజు తప్పకుండా పంట నమోదు చేస్తూ వీఆర్వో ధృవీకరణ పూర్తి చేసి ఈ కేవైసీ ప్రమాను సారం పూర్తి చేయాలని వ్యవసాయాధి కారికి సూచించారు. వేరు శనగ, బొప్పాయి, మేత జొన్న , ద్రాక్ష పంటలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తూ తనిఖీ చేశారు. అనంతరం ,పెస్ట్ సర్వైవలెన్స్ , యూరియా ఔట్రీచ్ జీఎస్టీ సూపర్ సేవింగ్ సంబంధించి ఆర్ఎస్‌కె లకు అప్‌లోడ్ చేయాలని, మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఈ పంట నమోదులో హాజరు కానీ రైతు సేవా కేంద్ర సిబ్బందికి నోటీసులు జారీ చేయమని ఆదేశించారు. వీరి వెంట మండల వ్యవసాయ అధికారి అప్పోజీ , వీఆర్వో గంగులప్ప ఆర్ ఎస్‌కె సిబ్బంది నరసింహులు, భవ్య, వాలియా నాయక్ రైతులు పాల్గొన్నారు.


ద్రాక్ష పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఉన్నత పాఠశాలకు స్వచ్ఛ అవార్డు: హెచ్ఎం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: స్వచ్ఛ ఆంధ్ర పాఠశాలగా బంగారుపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంపిక అయ్యిందని పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాజేంద్ర తెలిపారు. సోమ వారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ పాఠశాల అవార్డు అందుకోనున్నట్లు హెచ్ఎం తెలిపారు. ఇది పాఠశాల ఉపాధ్యా యు ల కృషితో సాధ్యమైంద న్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

ప్రజాశక్తి -సోమల:(సదుం): మండల కేంద్రమైన సదుం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు. ఎంఈఓ వీజీఎన్ రాజన్ అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయ సన్మానంలో పలువురు ఉపాధ్యాయులు సన్మానాలు పొంది ప్రశంసా పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ పాలమంద ప్రధానోపాధ్యా యులు నిరంజన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు మోహన్ కుమార్ రెడ్డి, కిషోర్ కుమార్, కృష్ణమూర్తి, వినోద్ , మండలంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తవణంపల్లి: తవణంపల్లి హైస్కూలులో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మురళీ మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి ఎంఈఓ హేమలత మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, మాజీ మండల అధ్యక్షులు దిలీప్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -యాదమరి: ఈ నెల 7వ తేదీ నిర్వహించనున్న 'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మధన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తు న్నా ఇంతవరకు ఉద్యోగ సంఘాలను కనీసం చర్చలకు ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదని అందులో రాష్ట్ర ఫ్యాప్టో ఆధ్వర్యంలో వివిధ డిమాండ్ల పరిష్కార నిమిత్తం 12 వ పిఆర్‌సి కమిటీకి ఛైర్ పర్సన్‌ను నియమించాలని కోరారు. ఆలస్యం అవుతున్న దృష్ట్యా వెంటనే మధ్యంతర భృతి ఐ ర్ 30 శాతం తగ్గకుండా ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఎలను వెంటనే ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్‌సీ ద్వారా ఎంపికైన 2004 సెప్టెంబర్ ఒకటవ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన మెమో నెంబర్ :57 అమలు చేసి వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ మంజూరు చేయాలని అక్టోబర్ 7వ తేదీ విజయవాడ ధర్నా సెంటర్ లో నిర్వహించనున్న ధర్నాను ఎస్‌టియు కార్యకర్తలు , ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు 30 వేల కోట్ల ఆర్థిక దశలవారీగా విడుదల చేయాలని, 11 పి ఆర్ సి బకాయిలు, సరెండర్ లీవ్ నకు ఇచ్చే నగదు బకాయిలు,, పిఎఫ్, ఏపీ జి ఎల్ కాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు నిబంధనలను రూపొందించి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ లుగా, లు గా ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున విజయవాడకు తరలివచ్చి ఫ్యాప్టో ధర్నా కార్యక్రమంలో విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్రన్, చిత్తూరు డివిజన్ కన్వీనర్ ఢిల్లీ ప్రకాష్, ఆ సంఘ నాయకులు, గుణశేఖర్, బాలచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం పిల్లై, కమలాపతి, గణపతి, రంగనాథం, సుల్తాన్, శివ, శ్రీనివాసులు, సురేష్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు

క్రైం న్యూస్


ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వ్యక్తులు

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

- బంధువుల ఇంటికి వెళుతూ మృత్యు ఒడిలోకి
- హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణరక్షణ
- గ్రామాల్లో విషాదఛాయలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురు ఎదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన వెదురుకుప్పం మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఆదివారం స్థానికుల కథనం మేరకు..తిరుపతి జిల్లా, దుర్గ సముద్రం గ్రామం సమీపంలో వడ్డీ ఇళ్ల గ్రామానికి చెందిన సాయికుమార్ (23) అతని స్నేహితుడు తేజ ఇద్దరు స్నేహితులు, బంధువులు తేజాది సొంత గ్రామం వెదురుకుప్పం మండలంలోని తిరుమలయ్య పల్లికి చెందిన సాయికుమార్ బైక్‌లో సొంత గ్రామానికి బయలుదేరాడు. అదే సమయంలో మండలంలోని కొమరగుంట పంచాయతీ, సామి రెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన యుగంధర్ (21) తిరుపతి వైపు వెళు తున్నాడు. పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మన్ దొడ్ల గ్రామం సమీపంలో ఎదురు ఎదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాయికుమార్, యుగంధర్ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. తేజ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. 108 సాయంతో తిరుపతి రుయాకు తరలించారు. వెదురుకుప్పం ఎస్ఐ వెంకట సుబ్బయ్య తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం నిర్వహించి పుత్తూరు వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతులకు ఇంకా వివాహం కాలేదు. దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ వుంటే ప్రాణాలు దక్కేవి..

పోలీసు వారు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు ఇలా ప్రమాదాలకు గురి కాకుండా, వాటి నుంచి బయటపడేటందుకే ప్రజల్లో హెల్మెట్‌పై అవగాహన కల్పించేవారు. ఇద్దరు హెల్మెట్లు ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడేవారు. స్వల్ప గాయాలతో. తల్లిదండ్రులకు ఈ శ్లోకం తప్పేదని చూసినా స్థానికులు చెబుతున్నారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు..మండలంలోని పాలేరు గ్రామంలో శ్రీనివాస్ కుమార్తె దివ్యలక్ష్మి (13) ఉదయం నుండి కనిపించడం లేదని పరిసరాలు వెతికినా ఆచూకీ కనిపించడం లేదని దివ్య లక్ష్మీ తల్లి వాసంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక అదృశ్యం కేసు నమోదు చేశామని పోలీసులు ఆదివారం తెలిపారు.

బస్టాండులో చోరీ

- నిందితుడికి దేహశుద్ధి
- రూ.34 వేలు స్వాధీనం, పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్‌టిసి బస్టాండులో ఓ ప్రయాణికుడి వద్ద 60 వేలు రూపాయలు తస్కరించిన దొంగను పట్టుకుని అందని వద్ద 34 వేల రూపాయలు లాక్కుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పలమనేరు ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో పుంగనూరు బస్సు ఎక్కుతున్న ఓ ప్రయాణికుడి జేబులో నుండి 60 వేల రూపాయలను ఓ దొంగ చాకచక్యంగా తస్కరించాడు. వెంటనే ప్రయాణికులను తనిఖీ చేయగా ఓ అనుమానుతుడిని పట్టుకొని దేహశుద్ధి చేయడంతో అతను 34 వేలు రూపాయలు తిరిగి ఇచ్చాడు. మిగిలిన డబ్బు తనకు తెలియదని చెప్పడంతో ఆ దొంగను పోలీసులకు అప్పగించారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.


జలపాతంలో పడి మృతి చెందిన శ్రీనివాసులు

గిడిగి జలపాతంలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వికోట : మండల పరిధిలోని యాలకల్లు సమీపంలోని గిడిగి జలపాతంలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ..వికోట మండలం చిన్నాగనపల్లికి చెందిన శ్రీనివాసులు (45) ఆదివారం ప్రముఖ పర్యాటక కేంద్రమైన గిడికి జలపాతాన్ని సందర్శించడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో పడి కొట్టుకుపోయాడు. స్థానికులు వీకోట పోలీసులకు సమాచారం అందించడంతో వారు పలమనేరు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పలమనేరు అగ్నిమాపక శాఖ అధికారి మనోరంజన్ ఆధ్వర్యంలో సిబ్బంది జలపాతంలో గాలించి మృత దేహాన్ని బయటకు తీసి పోలీసులకు అప్పగించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ ప్రదేశంలో వేలి ముద్రలు సేకరణ



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పార్వతి నగర్(బంగ్లా) గ్రామంలో శనివారం సాయంత్రం ఓ ఇంట్లో చోటుచేసుకున్న చోరీ సంఘటనను ఛేదించేందుకు వేలిముద్రల నిపుణులు ఆ ఇంటికి చేరుకుని ఆదివారం పలుచోట్ల వేలిముద్రలు సేకరించారు. భారీ మొత్తంలో బంగారం, నగదు చోరీ జరిగినట్లు వదంతులు వస్తున్నాయి. దీంతో పోలీసులు దొంగలను పట్టుకునేందుకు పలు రకాలుగా సాంకేతికతను ఉపయోగించుకొని తమ ప్రయత్నాలు చేస్తున్నారు. పూర్తి విషయాలు కేసు దర్యాప్తులో తెలియాల్సి వుంది.

ఏనుగుల సంచారం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఆవులపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తూరు పరిసర ప్రాంతాలలో అటవీ ప్రాంతాలలో ఏనుగులు సంచరిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. సాయంత్రం వేళల్లో ఏనుగుల ఘీంకారం వినిపిస్తోందని అయితే పంట నష్టం ఏమి చేయడం లేదని, రైతులు ఏనుగులు సంచరిస్తున్న సమీప ప్రాంత వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. అటవీ శాఖ వారు ఏనుగుల కదలికలపై ప్రజలకు రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేసి అప్రమత్తం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.